క్లుప్తంగా

ఘనంగా కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ట

పీసీపల్లి: మండలంలోని వెంగళాయపల్లి ఎస్సీ కాలనీలో శ్రీ కోదండ రామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానాన్ని టీటీడీ ఆధ్వర్యంలో సమరతా ఫౌండేషన్ సహకారంతో రూ.10 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

'ఆహా 'క్యాంటీన్ పరిశీలన

కనిగిరి రూరల్: మెప్మా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న ఆహా క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ శుక్రవారం పరిశీలించారు. టీఎంసీ రఘు, క్యాంటీన్ నిర్వాహకులు వహిదా, ఖాతున్‌బీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెనూ నాణ్యతగా ఉండాలి

హనుమంతునిపాడు: జగనన్న గోరు ముద్దల పథకంలో భాగం పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మెనూ అమలు తోపాటు భోజనం రుచికరంగా వంట చేసి విద్యార్థులకు అందించాలని ఎంఈఓ ఎస్ .రమణయ్య, కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్‌బాబు కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెనూ పరిశీలించారు.

వైఎస్సార్ బీమాతో ధీమా

పామూరు: వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని మైనారిటీసెల్ నాయకులు, ఎంపీటీసీ షేక్ అబ్దుల్, సచివాలయ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. మృతి చెందిన మారంరెడ్డి జగన్ (38) కుటుంబీకులకు శుక్రవారం నగదును వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ సయ్యద్ ఖాజాషరీఫ్, పీఎస్ బ్రహ్మయ్య అందజేశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు నాటడం వలన పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ప్రిన్సిపాల్ జిలానీ బాషా, యన్‌యస్‌యస్ అధికారి గోపీచంద్ ప్రకాష్ తెలిపారు.

ఎంపీహెచ్ఈఓగా ఆరీఫ్

గుడ్లూరు: మండల ఆరోగ్య విస్తరణాధికారి (ఎంపీహెచ్ఈఓ)గా షేక్ ఆరీఫ్ స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఉలవపాడు మండలం చాకిచర్లలో విధులు నిర్వహిస్తున్న ఆరీఫ్ మండలంలోని చేవూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి బదిలీపై వచ్చారు.

100 రోజులు పని కల్పించాలి

గుడ్లూరు: ఉపాధి హామీ పనులకు వచ్చే ప్రతి కూలీకి 100 రోజులు పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ సంజీవరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్‌లు మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. ఏపీఓ అబ్దుల్లా, టీఏలు హరినారాయణ, చెన్నయ్య, పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం



మానసిక దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న కుటుంబ సభ్యులు

కనిగిరి రూరల్: దివంగత మాజీ ఎమ్మెల్యే భూతలపల్లి రామసుబ్బారెడ్డి భార్య కామాక్షమ్మ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని ఎస్కేఆర్ మానసిక వికలాంగుల కేంద్రం, గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేశారు. దాత కుమారుడు భూతలపల్లి మాలకొండారెడ్డి, కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయం పెంచడమే లక్ష్యం

కందుకూరు: మున్సిపాలిటీకి వచ్చే పన్నేతర ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఖాళీ మున్సిపల్ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి తెలిపారు. పాత కూరగాయల మార్కెట్ స్థలంలో రూ. 47 లక్షలతో నూతనంగా నిర్మించిన స్కంధపురి వాణిజ్య సముదాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. 46 లక్ష్యం కాగా ఇప్పటికే 24 దుకాణాలను పూర్తి చేశామన్నారు.

రూ. 10.80 కోట్ల పనులు పూర్తి

కందుకూరు మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 26కోట్ల ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేశారని, ఈ నిధులతో పట్టణంలో 170 అభివృద్ధి పనులకు టెండర్లు కేటాయించామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రాళ్లవాగు కాల్వపై మొదటి విడతలో పనులు చేయించామని చెప్పారు. శ్మశానాల అభివృద్ధికి రూ. 85 లక్షలు కేటాయించామన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే రోడ్ల ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు.



స్కందపురి వాణిజ్య సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

త్వరలోనే జీ+3 ఇళ్ల ప్రారంభం

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో నిర్మించిన జీ+3 ఇళ్లను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మానుగుంట తెలిపారు. నుడా అనుమతి లేని లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయవద్దని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకునే సమయంలో 33 శాతం అదనంగా మున్సిపాలిటీకి పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కమిషనర్ ఎస్. మనోహర్, డీఈ శ్రీరామమ్మూర్తి, కాంట్రాక్టర్ తల్లపనేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి



బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 14వ వర్ధంతి వేడుకలను శనివారం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా యూనివర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ భవన్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం చెక్ పోస్టు వద్ద, ఆగార్లపేట రోడ్డు, చింతలపాలెంలోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు, పండ్లు రొట్టెలు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

వెలిగండ్ల: వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు.

ఉలవపాడు: వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని మండల కన్వీనర్ చంద్రశేఖర్, జెసీయస్ కన్వీనర్ ధనకోటి, పట్టణ కన్వీనర్ కృష్ణారెడ్డి కోరారు. వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ కార్యక్రమం ఉందని తెలిపారు.

గుడ్లూరు: దమండల కేంద్రమైన గుడ్లూరులో శనివారం కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కొర్విపాటి బాపిరెడ్డి, మండల కన్వీనర్ క్రిష్ణయాదవ్, జేసీఎస్ కన్వీనర్ కిషోర్, జిల్లా కార్యదర్శి రమణయ్యలు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పేదలకు వరం

కనిగిరి రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక పేద వర్గాలకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 7వ సచివాలయంలో కాశిరెడ్డి కాలనీలో వైఎస్సార్ పెన్షన్ కానుక కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ నగదును శుక్రవారం పంపిణీ చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వార అర్హతే ప్రమాణికంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందచేస్తున్నట్లు వివరించారు. అడ్మిన్ సునీల్, వెల్ఫేర్ సెక్రటరీ వాసు, బాబు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కనిగిరి: పెన్షన్ అందజేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

పామూరు: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన 241 నూతన పెన్షన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, జె.గోవిందయ్య, కోటపాటి రవికుమార్‌రెడ్డి, కోటా వెంకట క్రిష్ణారెడ్డి, దండు నారాయరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగండ్ల: సర్పంచ్ టి. సురేష్‌బాబు, సచివాలయ కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం శుక్రవారం పింఛన్లు అందజేశారు. దాదా పుల్లారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలానికి నూతనంగా మంజూరైన 121 ఫింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీఓ ఆర్. శ్రీనివాసులరెడ్డి, మండల కన్వీనర్ గోపవరపుబొర్రా రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రూ.2750 చొప్పులు 121 మందికి అందజేశారు.

గుడ్లూరు: మండలంలో బుధవారం 85 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగా 409 పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని పింఛన్లు అందించారు. ఉదయాన్నే లబ్ధిదారుల వద్దకు చేరుకున్నారు.

కందుకూరు రూరల్: మండలంలోని కొండముడుసుపాలెంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ ఇంటూరి సుశీల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 21 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. సర్పంచ్ వి.శ్రీను, ఎంపీటీసీ ఎస్.ప్రసన్నయ్య పాల్గొన్నారు.

కొండపిలో విజయం వైఎస్సార్ సీపీదే..

- యువత, ప్రజలు అదే కోరుకుంటున్నారు
- వైఎస్సార్ సీసీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

మర్రిపూడి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడానికి యువత ఉవ్విళ్లూరుతోందని ఆ పార్టీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని చిలంకూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు తోట నర్సింహరావు తల్లి కాంతమ్మ(65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వరికూటి అశోక్‌బాబు శుక్రవారం కాంతమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సంక్షేమ ఫలాలు మరో ఐదేళ్లపాటు సక్రమంగా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి పక్ష నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. యువగళం పాదయాత్ర పేరుతో నారా లోకేష్ జిల్లాలో అగుడుపెట్టడం వల్ల వరుణ దేవుడు మొహం చాటేశాడని ఎద్దేవా చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మాకినేని శ్రావ్య కుటుంబ సభ్యులను అశోక్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దొద్దాలి మల్లికార్జునరావు, మొల్లల శివరామిరెడ్డి, పి.కోటయ్య, తోటా నరసింహారావు, ఎం చంద్రమౌలి, కె.వెంకట్రావు, క్రిష్టిపాటి సుబ్బారెడ్డి, ఎం.శ్రీను తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

ఇంటింటికీ కుళాయి నీరు

- ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి
- తేటుపురంలో ఆర్వో ప్లాంటు ప్రారంభం

టంగుటూరు: గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని అనంతవరం పంచాయతీ తేటుపురం వాసులకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. తేటుపురంలో ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన ఆర్వో ప్లాంటును శుక్రవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రారంభించారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ.. ఎంపీ నిధులు రూ.2.75 లక్షలు, అనంతవరం నాయకులు ఏవీఎస్ రాజు రూ.లక్ష మొత్తం రూ.3.75 లక్షలతో ఆర్వో ప్లాంటు నిర్మించామన్నారు. అనంతవరం–తేటుపురం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రెడ్డి కళా కోలాటం బృందం ప్రదర్శనను ఎంపీ తిలకించారు. కార్యక్రమంలో సర్పంచి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ కసుకుర్తి వెంకటేశ్వర్లు, మర్రి భాస్కరరెడ్డి, రాజు నాగిరెడ్డి ,సచివాలయ కన్వీనర్లు ఉప్పలపాటి సుబ్బరాజు, రాజు యామినీలక్ష్మి, రాజు వేణుగోపాలరెడ్డి, బల్లిబోయిన శ్రీనివాసరెడ్డి, అక్కల స్వామిరెడ్డి, మూలగాని తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు మర్రి రాఘవరెడ్డి, పల్లెబోయిన రాజమోహనరెడ్డి, రాజు కొండారెడ్డి, మున్నంబాల కోటిరెడ్డి, శారీమందిర్ వెంకటేశ్వర్లు, మన్నం వెంకయ్య, కన్నా వెంకట్రావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వరికూటి అశోక్‌బాబు

మోటారుసైకిళ్లు ఢీ.. ఇద్దరికి గాయాలు

కొండపి(సింగరాయకొండ): ప్రమాదవశాత్తు రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం చిన్నకళ్లగుంట గ్రామం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొండపి మండలం చిన్నకళ్లగుంట గ్రామానికి చెందిన మల్లాల కోటేశ్వరరావు తన భార్యతో కలిసి మోటారుసైకిల్‌పై కొండపి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్ వీరిని ఢీకొట్టింది. భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఢీకొట్టిన వ్యక్తి పరారయ్యాడు. ఒంగోలు జీజీహెచ్ నుంచి వచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదు చేశామని, ఢీకొన్న మోటారు సైకిల్‌ను గుర్తించామని ఎస్సై రమణయ్య తెలిపారు.

60 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండారెడ్డిపల్లిలో నిర్వహించారు. డాక్టర్ ప్రతాపురెడ్డి వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బందిషేక్ మస్తాన్, డేవిడ్, ఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం వేడుకలు



కనిగిరి రూరల్ ఆలయంలో భక్తుల పూజలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం భైరవకోనలో శ్రావణ శుక్రవారం వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కమిటీ చైర్మన్ సిద్దురమణా రెడ్డి, ఈవో యన్.నారాయణరెడ్డి పర్యవేక్షించారు.

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో మూడో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కమిటీ నాయకులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మ, ఏసీ చెంచులు, వీసీ రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

చెట్టుమహాలక్ష్మమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో చెట్టుమహాలక్ష్మమ్మ అమ్మవారు

సింగరాయకొండ: మండలంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపుకొమ్ములతో లలితా సహస్రనామం పఠించి కుంకుమ పూజ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డు అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న రాఘవరెడ్డి

జరుగుమల్లి: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తూమాడు గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి దావగూడూరు వెళ్లే రోడ్డును 3 కిలోమీటర్లు మేర రూ.ఐదు లక్షల ఎంపీ నిధులతో ఇటీవల అభివృద్ధి చేశారు. ఆ గ్రావెల్ రోడ్డును రాఘవరెడ్డి శుక్రవారం పరిశీలించారు. తొలుత జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారయణ ఘన స్వాగతం పలికారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తమవంతు సహకారం ఉంటుందని గామస్తులకు తెలిపారు. జరుగుమల్లి వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, దగ్గుమాటి శంకరరెడ్డి, వాసా నారాయణరెడ్డి, తోకల వెంకటేశ్వర్లు, వాసా సుందరరామిరెడ్డి, చాగంటి కొండయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆవశ్యకత గుర్తించండి

పామూరు: పౌష్టికాహార ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు గుర్తెరగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. కంబాలదిన్నె ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభించారు. శైలజ, డి.మాధురి, అరుణ, అనూష, గీతాంజలి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం మత్తులో కర్రతో దాడి

కొండపి(సింగరాయకొండ): మద్యం మత్తులో కర్రతో దాడి చేశారన్న ఆరోపణపై కొండపి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం కొండపి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన దాసరి బాలబ్రహ్మం, మదన్ మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వ్యక్తిగత విషయాలపై మాటామాటా పెరగడంతో మదన్ కర్రతో బాలబ్రహ్మంను తీవ్రంగా గాయపరిచాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలబ్రహ్మం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై రమణయ్య తెలిపారు.

177 నూతన పింఛన్లు మంజూరు

మర్రిపూడి: మండలలోని నూతనంగా 177 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య శుక్రవారం తెలిపారు. లబ్ధిదారులకు రూ.4,86,750 నగదును వలంటీర్ల ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 178 నూతన పింఛన్లకు సంబంధించి పరిశీలన పూర్తి చేసి రెండు రోజుల్లో పింఛన్ సొమ్ము అందిస్తామని చెప్పారు.

లారీని ఢీకొట్టిన టిప్పర్



క్యాబిన్లో ఇరుక్కుపోయిన టిప్పర్ డ్రైవర్

టంగుటూరు: నిద్ర మత్తులో ఉన్న టిప్పర్ డ్రైవర్ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన సంఘటన జాతీయ రహదారిపై టంగుటూరు ఫ్లయ్ ఓవర్ సమీపంలో శుక్రువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామాయపట్నం పోర్టు వద్ద గ్రానైట్ రాళ్లు దించిన టిప్పర్ తిరిగి చీమకుర్తి వెళ్తోంది. ఈ క్రమంలో టంగుటూరు ఫ్లయ్‌ఓవర్ వద్ద నిద్రమత్తులోకి జారుకున్న డ్రైవర్.. ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన టిప్పర్ డ్రైవర్ మనీర్ అంపాని లారీ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. కుడి కాలు పూర్తిగా విరిగిపోవడంతోపాటు బలమైన రక్త గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్‌ను జాతీయ రహదారి సిబ్బందితో కలిసి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం జాతీయ రహదారి అంబులెన్సులో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.